క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం పారిశ్రామికవాడలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున పారిశ్రామిక వాడ ప్రాంత ప్రజలు గమనించి విద్యుత్ అధికారులు గమనించి సహకరించాలని కోరారు.

30న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 30వ తేదీన విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. శనివారం గుండిమెడ గ్రామంలో రైతు, కౌలు రైతులతో కలసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారని అన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడం వలన పంటలను తక్కువ ధరలకు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు విద్యుత్ మీటర్లు పెట్టేందుకు ముందుకు రావడం తగదని అన్నారు. రైతాంగ సమస్యలపై జూన్ 30న జరిగే ధర్నాకు రైతులు, కౌలు రైతులు లక్షలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, అనుమోలు పాములు, నాగేశ్వరరావు, శివయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

మంగళగిరి: నగరంలోని న్యూ బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటేష్‌కు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. సరుకులను వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం అందజేశారు. తమ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని నిత్యావసర సరుకులు అందజేసినందుకు వెంకటేష్ భార్య లక్ష్మి ఎమ్మెల్యే ఆర్కేకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ఫిరంగిపురం: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నుదురుపాడు గ్రామానికి చెందిన పిచ్చయ్య రైల్వేస్టేషన్ వద్ద డ్రింకు దుకాణం నడుపుతున్నాడు. ప్రభుత్వ వైన్ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి దానిని అధిక ధరకు అమ్ముతున్నాడు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేయడంతో 12 బాటిళ్లు లభించడంతో అరెస్టు చేసి నరసరావుపేట రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివద్ద హాజరుపరచగా 14రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు.

బాల సుబ్రమణ్యేశ్వరునికి స్కంద షష్టి ప్రత్యేక పూజలు

మంగళగిరి: నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని బాల సుబ్రమణ్యేశ్వరస్వామి ఉపాలయంలో స్కంద షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, 21 కేజీల సజ్జలతో అర్చన నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు టి మహేష్ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలోని ముస్లిం ఖబర్‌స్థాన్ (శ్మశానవాటిక) ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ముస్లిం ఖబర్‌స్థాన్ అభివృద్ధికి నగరపాలక సంస్థ సుమారు రూ.28 లక్షల నిధులు కేటాయించింది. ఇటీవల ఖబర్‌స్థాన్ ఆవరణలో మట్టిని తోలించి మెరక పనులు పూర్తి చేశారు. శనివారం ఖబర్‌స్థాన్ చుట్టూ ఉన్న ప్రహరీ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా రాడ్ బెండింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ప్రహరీ నిర్మాణం పూర్తయిన అనంతరం ఖబర్‌స్థాన్ ఆవరణలో అంతర్గత సీసీ రహదారుల నిర్మాణంతోపాటు మృతుని అంత్యక్రియలకు హాజరైన బంధువులు వేచి ఉండేందుకు గది నిర్మాణం చేపట్టనున్నారు. తాగునీటి సౌకర్యంతో పాటు హైమాస్ట్ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు.

26 నుంచి ఉచిత యోగా శిక్షణా శిబిరం

మంగళగిరి: నగరంలోని లక్ష్మీనారాయణస్వామి దేవస్థాన ఆవరణలో శ్రీ రాధాకృష్ణ యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఉచిత యోగా శిక్షణా శిబిరం ప్రారంభించనున్నట్లు యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ తెలిపారు. మూడు వారాలపాటు జరిగే ఈ యోగా శిక్షణా శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వృద్ధుల వరకు శిక్షణా శిబిరంలో యోగా శిక్షణ పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురూజీ విజ్ఞప్తి చేశారు.

బీటీ రహదారి నిర్మాణానికి సర్వే పూర్తి

- త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం
- రూ.1.04 కోట్లతో బీటీ రహదారి
- రూ.1.83 కోట్లతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు
- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు


యర్రబాలెం వద్ద బీటీ రహదారి నిర్మాణానికి కొలతలు వేస్తున్న సచివాలయ సిబ్బంది

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో నూతన బీటీ రహదారి నిర్మాణానికి శనివారం సర్వే నిర్వహించారు. యర్రబాలెంలోని పొగాకు కంపెనీ వద్ద నుంచి చెరువు కట్ట వరకు బీటీ రహదారి నిర్మాణంతోపాటు సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2.87 కోట్ల నిధులను మంజూరు చేసింది. రూ.1.04 కోట్లతో బీటీ రహదారి నిర్మాణాన్ని, రూ.1.83 కోట్లతో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వెలగపూడిలోని ఏపీ సచివాలయం వైపు వెళ్లే ప్రతి వాహనం కార్పొరేషన్ పరిధి యర్రబాలెం చెరువు కట్ట మీదుగా ప్రయాణించాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరిగే సందర్భంలో ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక దీనికి తోడు పలు ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలకు చెందిన వందలాది బస్సులు, ఇతర వాహనాలు ఇదే మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ట్రాఫిక్‌కు అవరోధం ఏర్పడి స్థానిక ప్రజలు, పలువురు వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రత్యేక చొరవతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీటీ రహదారి నిర్మాణానికి, సీసీ డ్రెయిన్ నిర్మాణానికి నిధులను కేటాయించింది. టెండర్ల ప్రక్రియ ముగియడంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం బీటీ రహదారి నిర్మాణానికి సర్వే చేపట్టి కొలతలు వేసి మార్కింగ్ చేశారు. రానున్న రెండు మూడు రోజుల్లో ముందుగా సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించి అవి పూర్తయిన తరువాత బీటీ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నారు. వీలైనంత త్వరిత గతిన నిర్మాణ పనులు పూర్తిచేసి ఇకపై మంగళగిరి వైపు నుంచి ఏపీ సచివాలయం వైపు వెళ్లే వాహనాలను ఈ మార్గంలో మళ్లించి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని నగరపాలక సంస్థ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

మాట తప్పని ఏకైక నాయకుడు సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- నెక్కల్లులో గడప గడపకు మన ప్రభుత్వం


నెక్కల్లు గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

నెక్కల్లు(తాడికొండ): మాట తప్పని మడమ తిప్పని ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, పాదయాత్రలో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం నెక్కల్లు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో లబ్ధి జరిగిందనేందుకు జగనన్న అమలుచేస్తున్న నవరత్నాల పథకాలే నిదర్శనమన్నారు. పాదయాత్రలో ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించేందుకు 99 శాతం హామీలు అమలు చేసి నేడు గడప గడపకు భరోసాతో తిరుగుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అధికారంలోకి రాక ముందు దొంగ హామీలు ఇచ్చేందుకే తప్ప ఎన్నికల అనంతరం ఎప్పుడైనా ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికి తిరిగిన దాఖలా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా అర్హత ఉండి నాకు సంక్షేమం అందలేదు అనే ప్రశ్న వినిపించకూడదనే లక్ష్యంతో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షా పథకాన్ని ప్రవేశ పెట్టి ప్రతి గడపకు అధికారులను పంపిస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలంటే కాళ్లరిగేలా తిరిగినా కనికరించే నాథుడు ఉండేవాడు కాదని, నేడు దానికి భిన్నంగా ప్రజల వద్దకే అధికారులు వచ్చి ఇంటి ముంగిట సేవలందిస్తుంటే అది సువర్ణయుగం కాక మరేమిటో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, కొప్పుల శేషగిరిరావు, ఆలోకం సురేష్, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, బెజ్జం రాంబాబు, శృంగారపాటి సందీప్, గుమ్మా శ్రీనివాసరావు, గుమ్మా పూర్ణచంద్రరావు, బండ్ల శ్రీ కాంత్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.25లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


వడ్డేశ్వరం ఎంహెచ్‌నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరంలో కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి నిధులు కేటాయించి ఎంహెచ్ నగర్‌లో శనివారం సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంహెచ్‌నగర్‌లో కార్పొరేషన్ ప్రత్యేక నిధులు రూ.25 లక్షలు వెచ్చించి ఈ రోడ్ నిర్మాణం చేపట్టామని, మరో వారం రోజుల్లో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

శ్మశానవాటికల్లో గ్రావెల్ ఫిల్లింగ్


కొలనుకొండ విశ్వబ్రాహ్మణ శ్మశానవాటికలో గ్రావెల్ ఫిల్లింగ్ చేస్తున్న లారీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు కార్పొరేషన్ అధికారులు గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఎమ్మెల్యే ఆర్కే కొలనుకొండ పర్యటించిన సందర్భంలో విశ్వబ్రాహ్మణులు, ముస్లింలు తమ శ్మశానవాటిక ఎత్తు పల్లాలుగా ఉండడంతో దహనం, ఖననం చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కార్పొరేషన్ అధికారులతో చర్చించి రెండు శ్మశానవాటికల్లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు. రెండు మూడు రోజుల్లో గ్రావెల్ ఫిల్లింగ్ పూర్తికానున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, పక్కనే తహసీల్దార్లు రామ్‌ప్రసాద్, ఎం నాగిరెడ్డి

మంగళగిరి: నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె లలిత అన్నారు. నగరంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1.1.2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. పాత జాబితాలో పేర్లు తొలగించే ముందు కారణాలు పక్కాగా నిర్ధారించుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పుడు పేర్లు లేకుండా పరిశీలన జరపాలన్నారు. అదే సమయంలో అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని సూచించారు. ఎవరైనా ఇతర ప్రాంతానికి వలస వెళ్లినట్లయితే ఆ ప్రదేశంలోని ఏదైనా పోలింగ్ బూత్‌లో పేరు నమోదు చేసుకున్నారా? లేదా? అని నిర్ధారించిన తరువాతే ఇక్కడ జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. మృతి చెందిన వారి పేర్లను కూడా పక్కాగా పరిశీలించిన తరువాతే తీసివేయాలన్నారు. కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి తహసీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, ఎం నాగిరెడ్డి, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే దరియావలి, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్


విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న లయన్స్ గవర్నర్ శ్రీశాంతి దామర్ల

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి విద్య పునాది అని, గొప్ప సంకల్పంతో చదువును కొనసాగించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. గెలుపు లక్ష్యం కోసం అహర్నిశలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జోజప్ప ఆయన మాతృమూర్తి కానుమాను కిరీటమ్మ జయంతి సందర్భంగా అమ్మ అవార్డు పేరిట 2023 పదో తరగతి పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన ఉదయనాగలక్ష్మికి రెండు వేల రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన జాహ్నవికి వెయ్యి రూపాయలు, మూడో స్థానంలో నిలిచిన వి.కోమలికి వెయ్యి రూపాయలు బహుమతులను లయన్స్ గవర్నర్ శ్రీశాంతి దామర్ల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మిరియాల సాంబశివరావు, ఉపాధ్యాయులు కె.కాంతారావు, పి.బుజ్జిబాబు, రామచంద్రారెడ్డి, టి.శ్రీనివాసరావు, ఎస్‌వీఎస్ సత్యనారాయణ, కె. వెంకటేశ్వరరావు, రమణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దీనాపూర్ కళాశాలలో జాబ్‌మేళా


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐటీసీ ప్రతినిధులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని రూరల్ క్రిస్టియన్ జూనియర్ కళాశాల, దీనాపూర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఐటీసీ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్ చదివిన విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. వారికి ఐటీసీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఆకర్షణీయమైన జీతం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎండి.సుదర్శన్, సెంటర్ హెడ్ కీర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత అవధానం


గణిత అవధానం చేసిన విద్యార్థులతో మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని పెరల్స్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన గణిత అవధాన కార్యక్రమం ఆకట్టుకుంది. ఏడో తరగతి విద్యార్థులు పి.కిషోర్ జయదేవ్ రెడ్డి, సి.ఆద్యంత రామన్ నాయుడు గణితంలో ప్రతిభ కనబరిచారు. వంద టేబుల్స్ ఎక్కడ అడిగినా వెనువెంటనే సమాధానం ఇవ్వడంతో పాటు ఒకటి నుంచి 100 స్క్వేర్స్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, 2100 వరకు క్యాలెండర్‌లోని తేదీలతో పాటు అన్ని అంశాలను తడుముకోకుండా సమాధానాలు చెప్పి విద్యార్థులందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. 11 ఏళ్ల వయసులో ఆరో తరగతి చదువుతూ తనలోని అమోఘమైన ప్రతిభా సంపత్తులతో ఇటీవల టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసి 566 మార్కులను సాధించిన అనఘా లక్ష్మి కార్యక్రమంలో పాల్గొని 1000 టేబుల్స్ అలవోకగా చెప్పటంతో పాటు గణితంలోని వివిధ అంశాలపై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఈసందర్భంగా విద్యార్థులను సత్కరించి, ప్రశంసాపత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సాయి కిరీటి, డైరెక్టర్ బాబూరావు, అకడమిక్ అడ్వైజర్ ప్రసన్న, యోగాచార్య అచ్యుత ఇందుశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథోత్సవం



పాత గుంటూరు: గుంటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో వార్షిక శ్రీ జగన్నాథ రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ దేవాలయం అధ్యక్షులు పుండరీక గోవింద్‌దాస్ నిర్వహణలో ప్రారంభమైన రథోత్సవం కీర్తనలతో నగరంలోని ప్రధాన వీధుల్లో సాగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని జగన్నాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జగన్నాథ బలదేవ సుభద్రలకు మహానివేదన, హారతి, జగన్నాథ లీల కథాశ్రవణం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యక్షులు వీర్ గోవింద్‌దాస్, సీతాకాంత రామదాస్, భగీరథ దాస్, పూర్ణచంద్ర ప్రభు, నాగేంద్ర ప్రభు పర్యవేక్షించారు.

అర్హులందరికీ సంక్షేమం అందించేందుకే సురక్ష

బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్‌కుమార్


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బ్రహ్మానందరెడ్డి వేదికపై కత్తెర

తాడికొండ: అర్హత ఉండి ఏ కారణం చేతైనా ప్రభుత్వ సంక్షేమ పథకం కుటుంబాలకు అందకపోతే వారికి వెంటనే ఆ పథకం వర్తించేందుకే జగనన్న సురక్షా పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరులో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అందిస్తున్నారని, ఆ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేర్చడం మన కర్తవ్యం అన్నారు. సచివాలయాల పరిధిలో ఎవరికి సంక్షేమం అందలేదో గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందించే బాధ్యత కన్వీనర్లు, వలంటీర్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి శివన్నారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకటశివారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, శృంగారపాటి సందీప్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, తుమ్మూరు రమణారెడ్డి, చలివేంద్రం సురేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని డాక్టర్ కేఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసిన వారికి శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. దుగ్గిరాల ఇన్‌సాన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత గద్దె శ్రీనివాస్, బ్యాంక్ ఆఫ్ బరోడా విజయవాడ డివిజల్ మేనేజర్ ఎస్.వెంకటరావు మాట్లాడారు. ప్రిన్సిపల్ కె.గిరిధరరావు, ఎంపైర్ ఆగ్రో ఫారమ్స్ లిమిటెడ్ తాడేపల్లి చైర్మన్ జాన్, మేనేజింగ్ డైరెక్టర్ బోడేపూడి రజనీకాంత్, డైరెక్టర్ వెలినేని సంతోష రూప దేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.రాంబాబు, టి.రాఘవరెడ్డి, వై.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మత పెద్దలతో సమావేశమైన ఏఎస్పీ

పట్నంబజారు: బక్రీదు పండుగ పురస్కరించుకుని శనివారం లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిచికేష్ షలేకే, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ ఎస్.సుబ్బారావు, పాతగుంటూరు ఎస్‌హెచ్ఓ ఎన్.వి.సుబ్బారావు, ముస్లిం మత పెద్దలు, గోమాంస విక్రేతలతో సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ నిచికేష్ మాట్లాడుతూ బక్రీదు పండుగను పురస్కరించుకుని ఖుర్బాని నిమిత్తం పశువైద్య అధికారులు ధ్రువీకరించిన వాటిని మాత్రమే విక్రయించాలని సూచించారు. గోవులను అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తిరుమల అన్నదాన పథకానికి కూరగాయలు


తిరుమల అన్నదాన పథకానికి కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నూతక్కి రామకృష్ణ

తాడేపల్లిరూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన కార్యక్రమానికి 10 టన్నుల కూరగాయలను లారీలో ఉచితంగా శనివారం పంపించారు. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి విజయవాడ క్లబ్ రోడ్‌లోని ఆర్ఎల్ఎస్ గౌతమి రివర్ బ్రిజ్ అపార్ట్‌మెంట్ వద్ద నుంచి తిరుమలకు బయలుదేరిన లారీని జెండా ఊపి ప్రారంభించారు. తుమ్మల రాజేశ్వరరావు మాట్లాడుతూ మండవ నాగేంద్రరావు, సత్యశ్రీ, కుమార్తెలు రిషిత, సంహిత సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమానికి సుమారు రూ.50 వేలతో 10 టన్నుల కూరగాయలను పంపించడం సంతోషదాయకమని అన్నారు.

క్యాచ్ ది రైన్‌పై అవగాహన

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్‌లో నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ ఆధ్వర్యంలో క్యాచ్ ది రైన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. జానపద కళాకారులు పాటల రూపంలో విద్యార్థులకు ప్లాస్టిక్ బ్యాగుల నిషేధంపై అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం పలు రకాల మొక్కలు విద్యార్థులచేత నాటించారు. మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుకన్య, గ్రంథాలయ ఇన్‌చార్జి కె.తేజబాబు, పీఈటీ షేక్ రస్ హుస్సేన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

నగరంపాలెం: జిల్లాలో ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని రీజినల్ విజిలెన్స్/ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు అన్నారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం గుంటూరు నగరంలోని చుట్టుగుంట, మిర్చియార్డు, ఏటీఅగ్రహారం, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని శీతల పానీయాలు, బేకరి దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని పలు దుకాణాలపై పన్నెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరిరావు తెలిపారు.

గోరక్షణ పాదయాత్ర



గుంటూరు మెడికల్: గో పరివార్ జేఏసీ, గో భక్తుల ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో గో రక్షణ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని అమలు పరచాలని ప్రభుత్వ అధికారుల అందరికీ ఆదేశాలు పంపించడం జరిగిందన్నారు. గోవుల అక్రమ రవాణా నిషేధించాలని, గో సంతతి వధకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు గోమాతలకు రక్షణ కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బజరంగ్ రామకృష్ణ, దుర్గ బాబు, నవీన్ రెడ్డి ,ప్రదీప్ జైన్, డి.సత్యనారాయణ, దర్శనపు శ్రీనివాసు, ధార్మిక సెల్ ప్రసాదు, హైందవ శక్తి ప్రసాద్, వనమా నరేంద్ర పాల్గొన్నారు.